క్లుప్తంగా

వైభవంగా మహబూబ్ సుభాని గ్యార్మీ



ఫిరంగిపురం: వేములూరిపాడు గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మహబూబ్ సుభాని గ్యార్మీషరీఫ్‌ను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ముజావర్‌లు సయ్యద్ గౌస్, సయ్యద్ అఫ్జల్ ఆధ్వర్యంలో జెండా పండుగ, సంథల్, మిలాద్ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం ప్రత్యేకంగా అలంకరించిన గుర్రంపై సంథల్, పూల దండలు ఉంచి మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం మహబూబ్ సుభాని దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిర్దిష్ట అభ్యాస వైకల్యంపై అవగాహన



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కొత్తపేట ఎంపీపీ పాఠశాలలో భవిత నిర్దిష్ట అభ్యాస వైకల్యంపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మహబూబ్ సుభాని, సీహెచ్ రవికాంత్ మాట్లాడుతూ పిల్లల మానసిక స్థితిగతులను తల్లిదండ్రులు గమనించాలని చెప్పారు. దానిద్వారా పిల్లల పురోభివృద్ధికి అది ఎంతో దోహద పడుతుందన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు జ్యోతి, విజయలక్ష్మి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం



ఫిరంగిపురం: చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం చేయవచ్చని ఆరోగ్య సిబ్బంది అన్నారు. వేములూరిపాడు ఎంపీపీ పాఠశాలలో స్వచ్ఛభారత్, గ్లోబల్ హ్యాండ్ వాష్ డే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రతి రోజు ఆహారం తీసుకునేముందు, తర్వాత శుభ్రంగా చేతులు శుభ్రం చేసుకోవాలని ఆరోగ్య సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు, కార్యదర్శి, నాయకులు కటికల రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చేతుల శుభ్రతపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భోజనం చేసేటప్పుడు పాఠశాలలోను, ఇంటివద్ద చేతులను శుభ్రంగా కడుక్కోవాలని చెప్పారు. మనం వాడుతున్న అనేక వస్తువులపై క్రిములు ఉంటాయని ఆహారం ద్వారా శరీరం లోపలికి వెళ్తాయని వివరించారు. ఎంఈవో-2 కె. లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, కోఆర్డినేటర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉండవల్లిలో దసరా మహోత్సవాలు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ ఉండవల్లి రెడ్ల రామమందిరం వద్ద దసరా ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. అమ్మవారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భేతాళ సెట్లతో అమ్మవారి వేషధారణలో కళాకారులు నృత్యాలు నిర్వహించారు. కేరళ వాయిద్యాలు, బాణసంచా మధ్య అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారికి ప్రసాదంగా ఉండవల్లికి చెందిన బద్దిగం రమేష్‌రెడ్డి, సురేష్‌రెడ్డి ఇచ్చిన 46 కేజీల లడ్డూను వేలం పాటలో తమ్మా గణపతిరెడ్డి రూ.1.10 లక్షలకు దక్కించుకున్నారు. అమ్మవారికి లక్ష్మీదేవి అలంకరణకు స్రవంతి, నందిని రూ.50వేల 500రూపాయల నోట్లు అందజేశారు. ఈ హారాన్ని పల్లపోలు నాగిరెడ్డి రూ.60 వేలకుదక్కించుకున్నారు. 200 రూపాయల నోట్లు తక్కెళ్లపాటి తిరుపతిరెడ్డి రూ.20 వేలు అందజేశారు. ఈ హారాన్ని మున్నంగి సాంబిరెడ్డి రూ.30 వేలకు దక్కించుకున్నారు. రూ.10 వేలు విలువ చేసే 100 రూపాయల హారాన్ని బద్దికం రమేష్‌రెడ్డి అందజేయగా కళ్ళం వెంకటరెడ్డి రూ.17 వేలకు వేలంలో దక్కించుకున్నారు. రూ.5 వేల విలువ గల 50 రూపాయల హారాన్ని కళ్ళం శ్రీనివాసరెడ్డి అందజేయగా, ఉండవల్లికి చెందిన గూడూరు అంజిరెడ్డి, శ్రీనివాసరెడ్డి రూ.7 వేలకు దక్కించుకున్నారు.

వయసు మళ్లిన వంతెనలు

- బకింగ్ హామ్ కెనాల్‌పై 1950-60ల్లో నిర్మాణాలు
- ప్రధానమైన మూడు బ్రిడ్జిలు శిథిలావస్థకు..
- వేగంగా అభివృద్ధి చెందుతున్న మంగళగిరి
- రాజధాని కేంద్రంగా కీలకంగా మారిన పట్టణం
- నిత్యం పెరుగుతున్న రాకపోకలు
- ప్రమాదం జరిగితే తీవ్రత ఎక్కువే..
- నూతన బ్రిడ్జిలు నిర్మించాలంటున్న ప్రజలు, ప్రయాణికులు



తాడేపల్లి వెంబడి ప్రవహిస్తున్న బకింగ్‌హామ్ కెనాల్ వ్యూ..



కొలనుకొండ వద్ద పగిలిపోయిన బ్రిడ్జి స్లాబ్

తాడేపల్లి రూరల్: మంగళగిరి నియోజకవర్గం ఎక్కువ భాగం జాతీయ రహదారి పక్కనే ఉంది. విజయవాడ, గుంటూరు నగరాల మధ్య ఉండడంతో గత 15 సంవత్సరాల నుంచి శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. దాంతో పాటు ప్రతి గ్రామంలో 30-40 అడుగుల లోపు స్వచ్ఛమైన తాగునీరు లభిస్తుండడంతో ఉద్యోగులు, వ్యాపారులు స్థలాలు కొనుగోలు చేసి, ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇదిలా ఉంటే, కృష్ణానది పక్కనే ఉండడంతో వాటికి అనుసంధానంగా తాగునీరు, సాగు నీటి కోసం గంటకు పది వేల క్యూసెక్కుల నీటి సామర్థ్యం గల బకింగ్ హామ్ కెనాల్ కూడా నియోజకవర్గంలో ఎక్కువ భాగం ఉంది. నియోజకవర్గంలోని బైపాస్ రోడ్డు నుంచి గ్రామాల్లోకి వెళ్లాలంటే ఈ కాలువను దాటి వెళ్లాల్సిన పరిస్థితి.

శిథిలావస్థకు బ్రిడ్జిలు

బకింగ్ హామ్ కెనాల్‌పై 1950-60 మధ్య నిర్మించిన బ్రిడ్జిలకు కాలం చెల్లి, శిథిలావస్థకు చేరాయి. ప్రధానంగా నియోజక వర్గంలో మూడు చోట్ల 20 గ్రామాలను కలుపుతూ ఈ బ్రిడ్జిలు ఉన్నాయి.

- మొదటి బ్రిడ్జి మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోకి వస్తుంది. ఇది సింగల్ బ్రిడ్జి కావడంతో తాడేపల్లికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. 1999లోనే ఇరిగేషన్ అధికారులు ఈ బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందని నిర్ధారణ కూడా చేశారు.
- రెండవ బ్రిడ్జి జాతీయ రహదారి నుంచి కేఎల్ యూనివర్సిటీకి వెళ్లే మార్గంలో వడ్డేశ్వరం వద్ద ఉంది. ఈ బ్రిడ్జి పరిస్థితి కూడా అదే విధంగా ఉంది.
- మూడవ బ్రిడ్జి దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు వద్ద ఏర్పాటు చేశారు. ఈ బ్రిడ్జి మీద భారీ వాహనాలు తిరుగుతుండడంతో పూర్తిగా ధ్వంసమైంది. నాలుగవ బ్రిడ్జి దుగ్గిరాల వద్ద నిర్మించారు. దీని పరిస్థితి కూడా అదే విధంగా ఉండడం విశేషం.
- చిన్న చిన్న పల్లెటూళ్లకు కూడా పెద్ద పెద్ద బ్రిడ్జిలు నిర్మాంచారు. కానీ, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో బకింగ్ హామ్ కెనాల్ మీద పెద్ద బ్రిడ్జిలు చేపట్టేందుకు మాత్రం ముందుకు రావడం లేదు. ప్రభుత్వం ఈ మూడు బ్రిడ్జిల పునర్నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరింది..



కొలనుకొండ బ్రిడ్జి ఎప్పుడో శిథిలావస్థకు చేరింది. ఈ బ్రిడ్జి మీద నుంచి ప్రతి రోజూ వందల మంది విద్యార్థులు ప్రయాణిస్తుంటారు. ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని ప్రతి ఒక్కరూ భయాందోళనకు గురవుతున్నారు.

– లోకం దుర్గాప్రసాద్, వడ్డేశ్వరం

మా చిన్నతనంలో నిర్మించారు



తాడేపల్లి పశువుల ఆసుపత్రి వద్ద బ్రిడ్జి మా చిన్నతనంలో నిర్మించారు. రాజధానికి, రెండు ప్రధాన రహదార్లకు తాడేపల్లి మునిసిపాలిటీ దగ్గరగా ఉండడంతో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కువ పన్నులు వసూలు అయ్యేది కూడా ఇక్కడే. రోడ్లన్నీ విస్తరించారు, కానీ బ్రిడ్జిల నిర్మాణం మాత్రం చేపట్టడంలేదు.

– అప్పిరెడ్డి, తాడేపల్లి

ప్రమాదకరంగా ఉంది..



నూతక్కి గ్రామానికి రావాలంటే రేవేంద్రపాడు బ్రిడ్జి నుంచి ప్రయాణించాల్సిందే. ఆ బ్రిడ్జి మీద నిత్యం భారీ వాహనాలు ప్రయాణిస్తుండడంతో శిథిలావస్థకు చేరింది. ఏదైనా ప్రమాదం జరిగితే కొన్ని గ్రామాలకు రవాణా సౌకర్యం నిలిచిపోతోంది.

–మేకల సాంబశివరావు, వ్యాపారి



కొలనుకొండ వడ్డేశ్వరం వద్ద ఉన్న బ్రిడ్జి



రేవేంద్రపాడు బ్రిడ్జి

రెండు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'



ఫిరంగిపురం: మండలంలోని మునగపాడు, మేరికపూడి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గుంటూరు డాట్ సెంటర్ కో-ఆర్డినేటర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పత్తి పంటకు గులాబి రంగు పురుగు ఆశిస్తుందని చెప్పారు. ఎకరానికి పది లింగాకర్షక బుట్టలు రైతులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మిర్చి పొలంలో ఎకరాకు 20 నుంచి 30కేజీల వేప పిండిని వేసుకోవాలన్నారు. దాని ద్వారా లార్వా వేరును ఆశించకుండా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి షేక్.సుభాని, ఇ.రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు జాబితా సిద్ధం

తాడికొండ: ప్రభుత్వ ఆదేశాల మేరకు సాగునీటి సంఘాల ఎన్నికలకు జాబితా సిద్ధం చేయాలని తహసీల్దార్ కె.నాసరయ్య సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో వీఆర్వోల సమావేశం నిర్వహించారు. మండలంలో 8 సాగునీటి సంఘాలున్నాయని, వాటి పరిధిలోని రైతుల జాబితాను ఇరిగేషన్ అధికారుల సహకారంతో సిద్ధం చేయాలని చెప్పారు. రెవెన్యూ సంబంధిత సమస్యలపై గ్రీవెన్స్‌లో వచ్చే అర్జీలను వెంటనే పరిష్కారం చేయాలన్నారు. మద్యం దుకాణాల గడువు ముగియడంతో నేడు ఎక్సైజ్ అధికారుల సమక్షంలో వీఆర్వోలు పంచనామా నిర్వహించి సరుకును అప్పగించాలని సూచించారు.

నోట్ పుస్తకాల పంపిణీ

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని వినాయకుడి గుడి వద్ద ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు పాల్గొని, మాట్లాడారు. పేద విద్యార్థుల కోసం మంత్రి నారా లోకేష్ సహకారంతో నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మొత్తం 180 విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, అద్దంకి మురళి, చల్లా శ్రీను, జి. నాగేశ్వరరావు, దుర్గారావు, దర్శి హరికృష్ణ, అమీర్, కరీముల్లా, షౌకత్, రహంతుల్లా పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన



తురకపాలెంలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్

మేడికొండూరు: పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా తాడేపల్లి ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మంగళవారం డోకిపర్రు, మంగళగిరిపాడు, మేడికొండూరు, వెలవర్తిపాడు గ్రామాల్లో రూ.75 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎంపీడీఓ తోట చందన జెడ్పీటీసీ సిద్దయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న, నాయకులు మల్లిపెద్ది రమేష్, రాచర్ల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన 'పల్లె పండుగ' శంకుస్థాపనలు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని రెండవరోజు మంగళవారం పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. శృంగారపురం, పెదపాలెం, చినపాలెం గ్రామాల్లో డొంక రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ షేక్ జబిన్ శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ పథకం నిధులతో శృంగారపురంలో రూ.39.87 లక్షలు, పెదపాలెంలో రూ.13.99 లక్షలు, చినపాలెంలో రూ.30 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన పనులను ప్రారంభించామని తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షురాలు కేశినేని అనిత, జనసేన పార్టీ అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీడీఓ ఎ. శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ కె.జె. నెహ్రూ, ఏపీఓ పాల్గొన్నారు.

జెమిలి ఎన్నికలతో రాష్ట్రాల హక్కులు కాలరాసే కుట్ర



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిరూరల్: ఈ నెల 21న గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సమకాలీన రాజకీయ పరిణామాలపై సభ నిర్వహిస్తున్నట్లు సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.రవి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఉండవల్లిలోని రాజధాని డివిజన్ కమిటీ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు తదితరులు హాజరుకానున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జెమిలి ఎన్నికల పేరుతో రాష్ట్రాల హక్కులను కాలరాసే ప్రయత్నాలు చేస్తోందని, ధరల పెరుగులతో సామాన్యులు విలవిల్లాడుతున్నారని ఆయన విమర్శించారు. ధరలను నియంత్రించడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. వల్లభాపురం వెంకటేశ్వరరావు, ఈమని రామారావు, సీహెచ్ సుందరరావు, టి.బక్కిరెడ్డి, అత్తలూరి వీర వెంకయ్య, ఉండవల్లి పార్థసారథి, పి.రాఘవులు, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

అవయవదానం..సజీవం



అవయవదానంపై ఎయిమ్స్ వైద్య విద్యార్థుల అవగాహన ప్రదర్శన



ప్రజలకు వివరిస్తున్న విద్యార్థులు

తాడేపల్లిరూరల్: అవయవ దానం చేయండి సజీవంగా ఉండండి అంటూ ఎయిమ్స్ వైద్య విద్యార్థులు మంగళవారం అవగాహన కల్పించారు. పట్టణ పరిధిలోని ఎయిమ్స్ హాస్పిటల్ నుంచి మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ అనాటమి దినోత్సవం సందర్భంగా అవయవదానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ నిర్వహించామని చెప్పారు. అవయవదాన ప్రాముఖ్యతను ప్రదర్శన ద్వారా వివరించారు. మంగళగిరి పట్టణానికి చెందిన దామర్ల నిర్మల అనే మహిళ తన మరణానంతరం దేహాన్ని పరిశోధన నిమిత్తం ఇస్తానని ఎయిమ్స్ విద్యార్థులకు రాతపూర్వకంగా చెప్పారు. ఆమెను విద్యార్థులు అభినందించారు.

ఇసుక తరలిస్తున్న ఇద్దరిని పోలీసులకు అప్పగింత

తాడికొండ: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరిని పట్టుకొని పోలీసులకు అప్పగించిన ఘటన తుళ్లూరు మండలం లింగాయపాలెం ఎన్‌సీసీ కంపెనీలో జరిగింది. వివరాల మేరకు.. ఆదివారం ఉదయం ఎన్‌సీసీ నిర్మాణ కంపెనీ నిల్వ చేసుకున్న ఇసుకను అక్రమంగా ఇద్దరు తరలిస్తుండగా.. కంపెనీ సిబ్బంది వారిని పట్టుకున్నారు. పెదకూరపాడు, అమరావతి మండలాలకు చెందిన శివకృష్ణ, వెంకటేష్‌ను అదుపులోకి తీసుకొని, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి కేసు నమోదు కాలేదు.

గొప్ప శాస్త్రవేత్త అబ్దుల్ కలాం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లిరూరల్: ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త, భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిల్లపల్లి మోహనరావు, ఆకురాతి రాజేష్, మాజీ కౌన్సిలర్లు, మహిళలు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలోని సుగాలి కాలనీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి, హెచ్‌ఎం డి. శ్రీనివాసప్రసాద్ అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. వెనిగళ్ళ శ్రీకృష్ణ ప్రసాద్, విశ్రాంత ఆచార్య లలితానంద ప్రసాద్, జెట్టి బాలరాజు, మాజీ సర్పంచ్ మేఘావత్ పార్వతి బాయి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

- తాడేపల్లిలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకటరావు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.
- దుగ్గిరాలలో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. షేక్ రషీద్, జానీ, బాజీ, జాన్ సైదా, మహమ్మద్ హుస్సేన్, జుల్ ఫకీర్ అలీ, పఠాన్ మస్తాన్, డాక్టర్ పెద్దేటి యోహాను, సుగుణరాజు, వెంకటేశ్వర్లు, ఎల్లేశ్వరరావు పాల్గొన్నారు.
- పెదవడ్లపూడి నాగార్జున హై స్కూల్ ఆధ్వర్యంలో మంగళవారం అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టీడీపీ రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్ చందు, దుగ్గిరాల జాగృత భారత్ ట్రస్ట్ అధ్యక్షుడు పసుపులేటి గణేష్ విచ్చేశారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జాగృత భారత ట్రస్ట్ ద్వారా 1,200 మంది విద్యార్థులకు కెలాక్స్ చాకో మ్యాజిక్ బాక్స్‌ను అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కలాం చిత్రపటానికి మైనార్టీ నాయకుల నివాళి



అబ్దుల్ కలాం జయంతిలో విద్యార్థులు, అధ్యాపకులు

తాడికొండ: రాయపూడి ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం మహమ్మద్ ఖాసిం అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని పాఠశాలలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలాం పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఉపాధ్యాయని నూర్జహాన్ పాల్గొన్నారు.

- మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు మంగళవారం నివాళులర్పించారు. కళాశాల ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విభాగం ఆధ్వర్యంలో ఐడియా కాంపిటీషన్ పేరుతో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, హెచ్‌వోడీలు, డీన్‌లు తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం చిత్రపటానికి ఉపాధ్యాయుల నివాళి



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వల్లభనేని వెంకటరావు



విద్యార్థులతో జవ్వాది కిరణ్ చందు, పసుపులేటి గణేష్

ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభం



మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల ఇంటెల్ హై స్కూల్ లో మంగళవారం బాలికల ఎన్‌సీసీ యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హైకోర్టు సీనియర్ కౌన్సిల్ పోసాని వెంకటేశ్వరరావు పాల్గొని, ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బాలికలు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఎన్‌సీసీ వల్ల క్రమశిక్షణతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కోనూరి జయకుమార్ తమ పాఠశాలకు ఎన్‌సీసీ యూనిట్ కేటాయించినందుకు కమాండింగ్ అధికారికి కృతజ్ఞతలు తెలిపారు. రిటైర్డ్ మేజర్ సి.రామ్మోహన్‌రావు, అశోకా రాణి జయకుమార్, ప్రధానోపాధ్యాయురాలు జె సుకన్య, పీడీ షేక్ రన్ను హుస్సేన్ పాల్గొన్నారు.